

అపార నష్టం.. ఆదుకోండి

జిల్లాలో పర్యటించిన కేంద్రబృందానికి అన్నదాతలు, ప్రజాప్రతినిధులు, రైతుసంఘాల నేతలు, కలెక్టర్ వినతులు



పెనమలూరు మండలం పెదపులిపాకలో దెబ్బతిన్న వరిని కేంద్రం బృందానికి చూపుతున్న కలెక్టర్ బాలాజీ (ఇన్‌సెట్లో) వరద నష్టంపై ఫొటో ఎగ్జిబిషన్ చూపుతూ..

- వివిధ రూపాల్లో రూ.1200 కోట్ల నష్టం
- శాఖల వారీగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్
- బృందానికి నష్టాన్ని వివరించిన కలెక్టర్
- నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యేల వినతి
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన కేంద్రబృందం

'కృష్ణానది నుంచి వచ్చిన భారీ వరదలు... జిల్లాలో కురిసిన భారీ వర్షాలు... ఉప్పొంగి ప్రవహించిన బుడమేరు... వెరసి అన్నదాతల వెన్ను విరిచాయి. వరి, మొక్కజొన్న, కంద, అరటి పంటలూ, మత్స్య పంటలూ ఏవీ మిగలకుండా చేశాయి. చివరకు పశువులనూ వరద లాక్కెళ్లింది. రైతులకు ఏమీ మిగల్లేదు. అపార నష్టం సంభవించింది. ప్రతి రైతునూ ఉదారంగా ఆదుకోండి' అంటూ కేంద్రబృందాన్ని ఎమ్మెల్యేలూ, అధికారులూ, రైతు సంఘాల నేతలూ, రైతులూ కోరారు. జిల్లాలోని పామర్రు, గుడివాడ, పెనమలూరు నియోజకవర్గాల్లో బుధవారం కేంద్రబృందం సభ్యులు అనిల్ సుబ్రహ్మణియం, రాకేష్‌కుమార్, ఎస్‌పీఎస్‌పీ శర్మ పర్యటించారు. దెబ్బతిన్న పంటలు, గృహాలు, రహదారులను పరిశీలించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. వరద వల్ల జిల్లాలో వివిధ రూపాల్లో రూ.1200 కోట్ల నష్టం వాటిల్లిందని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ బాలాజీ వివరించారు.

– ఆంధ్రజ్యోతి–మచిలీపట్నం /నందివాడ (పుట్టగుంట), తోట్లవల్లూరు

రూ.1.80 లక్షలు నష్టపోయా ఆదుకోండయ్యా..!



'నా పేరు మోర్ల శ్రీనివాసరావు. మాది తోట్లవల్లూరు మండలం రొయ్యూరు. ఎకరం కౌలుకి తీసుకుని పసుపు సాగు చేశా. ఎకరాకు 6 పుట్ల పసుపు విత్తనాలు (పుట్టు రూ.11 వేలు) కొని చేను వద్దకు చేర్చేసరికి రూ.70 వేలు ఖర్చయింది. దుక్కులు, పిండి, మందులకు రూ.50 వేలయింది. కౌలు రూ.50 వేలు ముందే చెల్లించా. అన్నీ కలిపి రూ.1.80 లక్షలు ఎకరాకు పెట్టుబడి అయింది. వరదకు సర్వం కోల్పోయా. మళ్లీ వేరే పంట వేయాలి. పెట్టిన పెట్టుబడి తిరిగి ఇప్పించండయ్యా' - కేంద్ర బృందం వద్ద కంటతడి పెడుతూ గోడు వెల్లబోసుకున్న రైతు దుస్థితి ఇది

రూ.1200 కోట్ల నష్టం

- తాడేపల్లిలోని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో కలెక్టర్ బాలాజీ పవర్‌పాయింట్ ప్రజంటేషన్, ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా జిల్లాలో జరిగిన నష్టాన్ని కేంద్రబృందానికి వివరించారు. బుడమేరు పొంగి ప్రవహించడంతో నష్టం మరింతగా పెరిగిందన్నారు. ఇంకా ఏమేం చెప్పారో ఆయన మాటల్లో..
- భారీ వర్షాలు, వరదలు కారణంగా వ్యవసాయ, అనుబంధ రంగాలు, రహదారులు, నీటిపారుదల శాఖ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర విభాగాలకు రూ.1200 కోట్ల నష్టం వాటిల్లింది.
- కృష్ణానదికి 1903లో 10.61 లక్షల క్యూసెక్కులు, 2009లో 10.94 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఈ ఏడాది అత్యధికంగా11.43 లక్షల క్యూసెక్కుల వరద రావడం వల్ల నష్ట తీవ్రత పెరిగింది. జిల్లాలో వ్యవసాయరంగంతో పాటు ఉద్యానపంటలు, ఆక్వారంగానికి కోలుకోలేని విధంగా నష్టం జరిగింది.

దేనికి ఎంత నష్టం అంటే..

- ఏయే శాఖకు ఎంత నష్టం జరిగిందో వివరాలను కలెక్టర్ కేంద్ర బృందానికి నివేదిక రూపంలో ఇచ్చారు.
- వరిసాగుకు రూ.385 కోట్లు, ఉద్యానపంటలకు రూ.108 కోట్లు, ఆక్వారంగానికి రూ.4.23 కోట్లు, పశుసంవర్థకశాఖకు రూ.22.01 లక్షలు, పరిశ్రమలకు రూ.34.43 కోట్లు నష్టం జరిగింది.
- నీటిపారుదల శాఖకు రూ.506 కోట్లు, ఆర్అండ్‌బీ రహదారులకు రూ.69 కోట్లు, పంచాయతీరాజ్ రహదారులకు రూ.60 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి రూ.51.40 కోట్లు, విద్యుత్‌శాఖకు రూ.15 కోట్లు నష్టం వాటిల్లింది.

ఎమ్మెల్యేలు ఏమన్నారంటే..

- పామర్రు నియోజకవర్గం తోట్లవల్లూరు మండలం రొయ్యూరులో పర్యటించిన కేంద్రబృందానికి అక్కడి ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా నష్టం తీరును వివరించారు. నియోజకవర్గంలో 80 శాతం మంది సన్న, చిన్నకారు రైతులేనని, రెండు ఎకరాలు, మూడెకరాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తారని తెలిపారు. లంక భూముల్లో పసుపు, మొక్కజొన్న, కంద, తమలపాకు తోటలను రైతులు సాగు చేశారని తెలిపారు. వాణిజ్యపంటల సాగుకోసం ఎకరానికి రూ.1.50 లక్షల నుంచి రెండు లక్షల వరకు పెట్టుబడిగా పెట్టారని భారీ వరద కారణంగా వారం రోజులకుపైబడి పంటలు నీటమునిగి ఉండటంతో అన్ని పంటలూ చనిపోయాయని వివరించారు.
- గుడివాడ నియోజకవర్గంలోని పంటపొలాలు, చేపలచెరువులు పూర్తిస్థాయిలో మునిగిపోయాయని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కలెక్టర్ బాలాజీ కేంద్ర బృందం సభ్యులకు వివరించారు. వరద కారణంగా పుట్టగుంట వద్ద నీటమునిగిన బుడమేరు వంతెనను కేంద్రబృందం సభ్యులు పరిశీలించారు. (మిగతా 6లో)

నావ రూపాల్లేకుండా..

- వరదలతో మత్స్యకారుల బతుకు అస్తవ్యస్తం
- వేటకు వెళ్లే వీల్లేక ఉపాధి కోల్పోయి అవస్థలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

అసలే అంతంతమాత్రం ఆదాయం. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలు వారివి. నావ నడవనిదే మెతుకులు దిగని దుస్థితి వారిది. వారే దివిసీమ మత్స్యకారులు. నెల రోజులుగా కొనసాగుతున్న వరద ఆ మత్స్యకారుల బతుకును ఛిద్రం చేసింది. వరద వల్ల వేట ఆగి ఉపాధి లేకుండా పోయింది. కుటుంబాలు గడవక అప్పులు చేయాల్సి వస్తోంది. ఏం చేయాలో దిక్కుతోచని స్థితి నెలకొంది. ప్రభుత్వం ఆదుకుంటేనే బతుకు నావ సాగుతుందని మత్స్యకారులు వేడుకుంటున్నారు.



15 గ్రామాల్లో తీవ్ర ప్రభావం

కృష్ణానది వరదల కారణంగా అవనిగడ్డ నియోజకవర్గంలోని 15 గ్రామాల ప్రజల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. చల్లపల్లి మండలం నడకుదురు, మోపిదేవి మండలం కె.కొత్తపాలెం, బొబ్బర్లంక, అవనిగడ్డ మండలం పులిగడ్డ, పాత ఎడ్లంక, అవనిగడ్డ, నాగాయలంక మండలం నాగాయలంక, జింకపాలెం, ఏటిమొగ, నాచుగుంట, కోడూరు మండలం వి.కొత్తపాలెం, విశ్వనాథపల్లి, పిట్టల్లంక, వేణుగోపాలపురం గ్రామాల మత్స్యకారులు వేట లేక అల్లాడుతున్నారు.

అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గంలో మొత్తం 7,352 మంది వేటపై ఆధారపడే మత్స్యకారులు ఉన్నారు. 23,553 మంది ప్రత్యక్షంగా, పరోక్షంగానూ మత్స్య సంపదపై ఆధారపడేవారు ఉన్నారు. మొత్తం 1167 బోట్లు దివి ప్రాంతంలోని బ్యాక్ వాటర్ పాయల్లోనూ, శ్రీకాకుళం మొదలు పులిగడ్డ వరకు ఉన్న కృష్ణానదిలో వేట సాగిస్తుంటాయి. ఇందులో 800లకుపైగా పడవలు కేవలం నదిపైనే ఆధారపడి జీవనం సాగిస్తుండగా, ఒక్కో పడవలో ఐదు నుంచి 12 మంది వరకు కళాసీలు ఉపాధి పొందుతుంటారు. గత నెల 16వ తేదీ నుంచి కృష్ణానదికి వరద కొనసాగుతుండటంతో వీరిలో నదిపై ఆధారపడి వేట సాగించే 800లకుపైగా పడవలు వేటకు వెళ్లే వీల్లేక ఒడ్డున కట్టివేసి ఉంచుతున్నారు.

అప్పులతో నెట్టుకొస్తున్న మత్స్యకారులు

గత నెల 16వ తేదీ నుంచి కృష్ణానదికి వరదలు వస్తుండటంతో నదిలో వేట చేసే మత్స్యకారులకు నదిలోనూ, బ్యాక్ వాటర్‌లోనూ వేట చేసే మత్స్యకారుల ఉపాధికి దెబ్బ పడింది. పడవ యజమానులు కళాసీలకు రెండు నుంచి ఐదు వేల మేర పెట్టుబడి ఇచ్చినప్పటికీ అది వారి కుటుంబ పోషణకు సరిపోకపోవటంతో అప్పులు చేసి జీవనం సాగించాల్సి వస్తోంది. నాగాయలంక, ఏటిమొగ, జింకపాలెం, నాచుగుంట గ్రామాల మత్స్యకారులు పోషణ కోసం సముద్రపు మొగలోకి వెళ్లి వేట సాగించాల్సిన దుస్థితి నెలకొంది. నదిలో వేట చేసే పడవలు సముద్రపు అలల ఉధృతికి సరిగా నిలబడే అవకాశం లేకపోవటంతో కేవలం కొద్దిమంది మత్స్యకారులు మాత్రమే సముద్రపు మొగలోకి వేటకు వెళ్తుండగా, మిగిలినవారు నది ఒడ్డునే కూర్చుని నది ఎప్పుడు తగ్గుతుందోనని ఎదురుచూస్తున్నారు.

రేషన్ పంపిణీ చేస్తున్న ప్రభుత్వం

మత్స్యకారులు వేటకు వెళ్లలేక పడుతున్న ఇబ్బందులు గమనించిన రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు ప్రత్యేకంగా రేషన్ అందిస్తోంది. పడవలపై పనిచేసే కళాసీలకు 50 కిలోల వంతున పడవ యజమానులకు 25 కిలోల వంతున బియ్యాన్ని, కిలో చొప్పున కందిపప్పు, ఉల్లిపాలెం, పంచదార, పామాయిల్, బంగాళదుంపలు అందిస్తోంది. అయితే మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో ఇచ్చే భృతిని ఈ సమయంలో విడుదల చేసి ఉంటే తమకెంతో ఉపయోగంగా ఉండి ఉండేదని మత్స్యకారులు వాపోతున్నారు.

రోజువారీ ఖర్చులకు ఇబ్బందులు



కృష్ణానదికి వచ్చిన వరదల కారణంగా నదిలోకి వేటకు వెళ్లే అవకాశం లేకపోవటంతో అప్పులతో కాలం గడపాల్సి వస్తోంది. నదిలో వేట చేయాలంటే వరద ఒరవడి కారణంగా వలలు నిలవటం లేదు. దిబ్బల పక్కన, లంకల పక్కన వేట చేద్దామంటే వరదలకు కొట్టుకువచ్చిన చెట్ల మోడులు, కంప తగిలి వలలు చిరిగిపోతున్నాయి. ప్రభుత్వం మత్స్యకార కళాసీలకు 50 కేజీల వంతున బియ్యం, సరుకులు అందజేసింది. అయినా రోజువారీ ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నాం.

– నాగరాజు, వెంకటరాజు, నాగాయలంక

దరఖాస్తుల వరద

- మూడు రోజుల్లో 5,151 దరఖాస్తులు
- ఇన్స్యూరెన్స్ ఫెసిలిటేషన్ సెంటర్‌కు క్యూ
- 407 క్లెయిమ్‌లకు రూ.3.36 కోట్ల చెల్లింపు
- మిగిలిన క్లెయిమ్‌లూ 10 రోజుల్లో పరిష్కారం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తోంది. నష్టపోయిన లేదా దెబ్బతిన్న వాహనాలు, నివాసాలు, దుకాణాలు, చిన్న మధ్యతరహా వ్యాపార సముదాయాలకు సంబంధించిన బీమా క్లెయిమ్‌లను వీలైనంత త్వరగా పరిష్కరిస్తున్నారు. ఇందుకోసం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఇన్స్యూరెన్స్ క్లెయిమ్ ఫెసిలిటేషన్ సెంటర్ నిరంతరం శ్రమిస్తోంది. తక్షణమే క్లెయిమ్ నమోదు చేసుకునేందుకు వాట్సాప్, టోల్‌ఫ్రీ నెంబరు, ఈ-మెయిల్, వెబ్‌సైట్ లేదా ఇతర మార్గాల ద్వారా అవకాశం కల్పించింది. ఈనెల 9న ప్రారంభమైన ఈ సెంటర్‌కు భారీ స్పందన వస్తోంది. ఇప్పటి వరకు 5,151 క్లెయింలు నమోదు కాగా, వాటి విలువ రూ.182.76 కోట్లు. మూడు రోజుల్లో 407 క్లెయింలను పరిష్కరించి రూ.3.36 కోట్లను చెల్లించారు. ఇంకా 4,744 క్లెయిమ్‌లను పరిష్కరించాల్సి ఉంది. వీటి విలువ రూ.179.40 కోట్లు. వచ్చిన క్లెయిమ్‌ల్లో మోటారు వాహనాలకు సంబంధించినవే 4,452 ఉన్నాయి. వీటి విలువ రూ.45.83 కోట్లు. వీటిలో 323 క్లెయిమ్‌లను పరిష్కరించి రూ.94 లక్షలు చెల్లించారు. మోటారు వాహనాలకు సంబంధించినవి కాకుండా గృహోపకరణాలు, ఇంటి బీమాకు సంబంధించినవి 699 ఉన్నాయి. వీటి విలువ రూ.136.93 కోట్లు. వీటిలో 84 క్లెయిమ్‌లు పరిష్కరించి రూ.2.42 కోట్లు చెల్లించారు.



విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇన్స్యూరెన్స్ క్లెయిమ్ ఫెసిలిటేషన్ సెంటర్

అనుసంధానకర్తగా ఏపీ జనరల్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్

ఈనెల 9వ తేదీన ఏపీ జనరల్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇన్స్యూరెన్స్ క్లెయిమ్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 22 ఇన్స్యూరెన్స్ కంపెనీలను ఒక వేదికపైకి తీసుకొచ్చారు. 15 కౌంటర్లలో సేవలందిస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉండి బీమాదారు అంగీకరిస్తే అక్కడికక్కడే క్లెయిమ్‌లు పరిష్కరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి క్లెయింలను పరిష్కరించేందుకు కాస్త సమయం తీసుకుంటున్నారు.

10 రోజుల్లో క్లెయిమ్‌ల పరిష్కారమే లక్ష్యం

వరద బాధితులకు ఇన్స్యూరెన్స్ క్లెయిమ్‌ల పరిష్కారంలో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఈ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. 10 రోజుల్లో క్లెయిమ్‌లను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలన్న ఉద్దేశంతో ఇన్స్యూరెన్స్ కంపెనీలు కూడా ఉదారంగా వ్యవహరిస్తున్నాయి. ఈ సెంటర్ ఏర్పాటుచేసి మూడు రోజులవుతోంది. తొలిరోజు స్పందన లేదు. రెండు రోజులుగా మంచి స్పందన వస్తోంది. ఇప్పటి వరకు 5వేల ఫైలుకు పేర్లు నమోదు చేసుకున్నారు. ఒరిజినల్ పత్రాలు పోయినా జిరాక్స్‌తోనైనా క్లెయిమ్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు.

– ఎస్.సుజీత్, చీఫ్ రిస్క్ ఆఫీసర్, ఏపీ జనరల్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్



బుడమేరు ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని

స్వచ్ఛందంగా..

- రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన సంస్థలు
- ప్రజాప్రతినిధులూ వరద బాధితుల సేవలోనే
- 10 రోజుల్లో 1.14 కోట్ల ఆహార ప్యాకెట్ల పంపిణీ
- 1.12 కోట్ల వాటర్ బ్యాటిళ్ల సరఫరా

బెజవాడను ముంచెత్తిన బుడమేరు వరద బాధితులను ఆదుకునేందుకు ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తరలివచ్చారు. మేమున్నామంటూ బాధితులకు అండగా నిలిచారు. కలెక్టరేట్ కేంద్రంగా 10 రోజులు నిర్విరామంగా సహాయ, పునరావాస కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఎందరో తరలివచ్చి భాగస్వాములయ్యారు.



కార్గిల్ ఇండియా ప్రతినిధుల సాయం..



లిటిల్ హ్యాండ్ ఆధ్వర్యంలో..



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న యార్లగడ్డ

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన విజయవాడను సాధారణస్థితికి తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబు తొలిరోజే రంగంలోకి దిగారు. కలెక్టరేట్‌ను సీఎం కార్యాలయంగా మార్చుకుని 24/7 వరద బాధితులకు అండగా నిలిచేందుకు అన్ని చర్యలూ తీసుకున్నారు. నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ బాధితుల కష్టాలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించారు. మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర, పార్థసారథి తదితరులు సైతం క్షేత్రస్థాయిలో ఉంటూ వీలైనంత త్వరగా బాధితులు కోలుకునేందుకు కృషి చేశారు.

ప్రజాప్రతినిధుల సేవలు ప్రశంసనీయం..

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ 10 రోజులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ బాధితులకు అండగా నిలిచారు. కేశినేని ఫౌండేషన్ ద్వారా కూడా ఆహారం, తాగునీరు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా కల్పించారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి తరఫున పశ్చిమ టీడీపీ నేతలు ఎంకేబేగ్ తదితరులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు రామలింగేశ్వరనగర్, కృష్ణలంక ప్రాంతాల్లో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు త్వరగా కోలుకునేందుకు అండగా నిలిచారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆహార పంపిణీలో కీలకపాత్ర పోషించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో బాధితులకు ఆహారం తయారుచేయించడం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఆహారాన్ని ప్యాకింగ్ చేయించడం, తాగునీరు ఏయే ప్రాంతాలకు పంపాలన్న అంశాలన్నీ యార్లగడ్డ పర్యవేక్షణలో జరిగాయి. 10 రోజుల్లో 1.14 కోట్ల ఆహార ప్యాకెట్లు పంపిణీ చేయడంతోపాటు 1.12 కోట్ల వాటర్ బ్యాటిల్స్‌ను బాధితులకు చేరేలా చూడటంలో వెంకట్రావు పాత్ర కీలకం. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తన నియోజకవర్గంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు అండగా నిలిచారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మంగళవారం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం శాంతినగర్‌లో పర్యటించారు. బాధితులకు భరోసా కల్పించారు

తరలి వచ్చిన స్వచ్ఛంద సేవకులు..

దేశవిదేశాల నుంచి పలు స్వచ్ఛంద సంస్థలు వరదబాధితుల కోసం తరలివచ్చాయి. తానా వంటి సంస్థలతోపాటు స్థానికంగా సేవా కార్యక్రమాలు నిర్వహించే పలు సంస్థలు వరదబాధితులకు అండగా నిలిచాయి. విశాఖపట్నంకు చెందిన శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు డాక్టర్ కుప్పిలి కీర్తి పట్నాయక్ ఆధ్వర్యంలో వరద బాధితులకు ఆహారం, దుప్పట్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. మూగజీవాలకూ ఆహారం అందించారు. గుడివాడకు చెందిన లిటిల్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్‌కు చెందిన అల్లూరి హేమంత్‌కుమార్ తదితరులు రాపిడ్ రెస్పాన్స్ టీంగా ఏర్పడి వరదల్లో చిక్కుకుపోయిన వారిని రక్షించడం.. ఆహారం, తాగునీరు అందించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. కార్గిల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు ఇస్కాన్‌తో కలిసి బాధితులకు నిత్యావసరాలు సరఫరా చేశారు. ఇలా ఎందరో స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలతో తమ పెద్ద మనసు చాటుకున్నారు.

సోనోవిజన్ జనార్దన్ మూర్తి, విజయలక్ష్మి ట్రస్ట్ రూ.10 లక్షలు వితరణ



సీఎం చంద్రబాబును కలిసిన సోనోవిజన్ అధినేత భాస్కరమూర్తి

వన్‌టౌన్ : వరద బాధితుల సహాయార్థం సోనోవిజన్ జనార్దన్ మూర్తి, విజయలక్ష్మి ట్రస్ట్ తరఫున రూ.10 లక్షల విరాళాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ పొట్లూరి భాస్కరమూర్తి బుధవారం చంద్రబాబును కలిసి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరద బాధిత ప్రాంతాల్లో పాడైపోయిన ఎల్ఈడీ, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, వాషింగ్‌మెషిన్లు, తదితరాలకు ఉచిత సర్వీసును అందజేస్తున్నామని, విడిపకరాలకు 50 శాతం రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు.

త్వరలో ఆపరేషన్ బుడమేరు!

- ముంపు ప్రాంతాల్లో మంత్రి నారాయణ పర్యటన

విద్యాధరపురం, సెప్టెంబరు 11 : బుడమేరు ఉండాల్సిన విస్తీర్ణం కంటే చాలా వరకు కుచించుకుపోయిందని.. దీనికోసం ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ఆపరేషన్ 'బుడమేరు' పేరిట ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామని మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు.బుడమేరు ఆక్రమణలు పెరిగిపోయాయన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలైన విద్యాధరపురం, జక్కంపూడి, కుందావరి కండ్రికలో అధికారులతో కలిసి ఆయన బుధవారం పర్యటించారు. జక్కంపూడి, వైఎస్ఆర్ కాలనీలలో బుడమేరు ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన వెంట కుమార్తె సింధూర కూడా ఉన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వరద ప్రభావిత ప్రాంతాలలో పది వేలమంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని బుధవారం సాయంత్రానికల్లా దాదాపు అన్ని ప్రాంతాల్లో పరిస్థితులను ఒక కొలిక్కి తీసుకువస్తామన్నారు. తీవ్రమైన వరద ఇబ్బందులను సిఎంతో పాటు మంత్రులు, అధికారులు పదిరోజులపాటు కష్టపడి సాధారణ స్థితికి తీసుకువచ్చారన్నారు. ఐదు ప్రాంతాల్లో ఇంకా వరద నీరు ఉందని, దానిని కూడా తగ్గించివేస్తామని చెప్పారు. మనిసిపల్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరుస్తున్నామన్నారు. బుడమేరు ప్రవాహనికి ఉన్న ఆటంకాలను అధిగమించటంపై ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు.



అధికారులతో కలిసి బుడమేరు ముంపు పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

ఊరును చుట్టేసిన వరద



నీటిలో కుళ్లిపోయిన వరి, పంటను చూపుతున్న రైతులు



- పదిరోజులుగా ముంపులోనే వరి చేలు
- దుర్గంధం భరించలేక అల్లాడుతున్న ఈలప్రోలు వాసులు
- నీరు బయటకు పోయే మార్గం లేదు
- పొట్టకు వస్తుందనుకున్న తరుణంలో 1200 ఎకరాల్లో వరి సర్వనాశనం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 11 : బుడమేరు వరద ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు గ్రామ రైతుల్ని కోలుకోలేని దెబ్బతీసింది. గ్రామం చుట్టూ వరిచేలు చెరువులను తలపిస్తున్నాయి. సుమారు 1,200 ఎకరాల్లో మరో వారం పది రోజుల్లో పొట్ట దశకు చేరుకుంటుందనుకుంటున్న పంట వరదపాలవడం రైతులకు మింగుడు పడటం లేదు. నీటిలో నానుతున్న పంట కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఏం రోగాలు వస్తాయోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. చేతికొస్తుందనుకున్న పంట వరద పాలవ్వడం ఊరు చుట్టు పట్టిన వరద నీరు ఇప్పటికీ బయటకు పోకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో గ్రామస్థులున్నారు. మరోవైపు పశుగ్రాసం కోసం మూగ జీవాలు అల్లాడుతున్నాయి. ఏ రైతును కదిలించినా అయ్యో పంటలు మొత్తం పోయాయి. ప్రాణాలు మాత్రం దక్కించుకోగలిగామని వాపోతున్నారు.

రైతుల కష్టాలు వారి మాటల్లోనే..

నిండా ముంచేసింది



- జూలపల్లి గంగారావు

బుడమేరు వరద నిండా ముంచేసింది. ఎకరానికి రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టాం. మరో కట్ట మందు, ఇంకోసారి పురుగు మందు కొడితే పొట్టదశకు మాగాణి చేరుకునేది. వరద పట్టి మొత్తం పంట సర్వనాశనమైంది. ఇప్పట్లో పొలాల్లో నీరు బయటకు పోయే మార్గం లేదు. ఈ ఏడాదికి ఏ పంట సాగు చేసుకునే వీలు లేదు. గండ్లు పడ్డాయి. చాలా వరకు పొలాలు మేటలు వేసి ఉంటాయి. వరద పూర్తిగా తగ్గితే మేటలు ఏ మేర వేశాయో తెలుస్తుంది.

రోగాలు వస్తాయని భయమేస్తోంది



- దామా హనుమంతరావు

పంటలు మొత్తం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. పది రోజులుగా పొలాల్లో ఎక్కడి నీరు అక్కడే ఉంది. బయటకు వెళ్లే అవకాశం లేదు. బుడమేరు పూర్తిగా తగ్గితే తప్ప ఈనీరు వాగు ద్వారా బయటకు పోయే మార్గం లేదు. రెగ్యులేటర్ గేట్లు ఎత్తినా, గండ్లు పడిన ముందు మునిగిపోయేది మాగ్రామమే. దుర్వాసన వల్ల రోగాలు వస్తాయేమోనని భయమేస్తున్నది.

కౌలు రైతులకు పరిహారం అందాలి :



- వల్లూరు కిషోర్ కుమార్

పంట పరిహార విషయంలో ప్రభుత్వం నిబంధనలు సడలించాలి. హెక్టారుకు రూ.25 వేలు ఇస్తామని అంటున్నది. అయితే రెండు హెక్టార్లుకు మాత్రమే పరిహారం ఇస్తే 20 నుంచి 30 ఎకరాలు కౌలుచేసే రైతులున్నారు. వారి పరిస్థితి ఏం కావాలి. ప్రభుత్వం నిబంధనలు సడలించి మొత్తం పంటకు పరిహారం అందించి ఆదుకోవాలి.

శాశ్వత పరిష్కారం చూపాలి



- దారపనేని కిషోర్ కుమార్

బుడమేరు వరద ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలి. వరదల వల్ల పంటలు పూర్తిగా పోయాయి. పశువులకు మేత లభించడం లేదు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. బుడమేరు వరద వచ్చి పడేది ముందు మా గ్రామం మీదే. ఆ తర్వాతే విజయవాడ పల్లపు ప్రాంతాలు మునుగుతాయి. సీఎం చంద్రబాబు చొరవ బాగుంది. నిత్యావసరాలు అందాయి. పంట పరిహారంలో కూడా న్యాయం చేయాలి.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- రైతుల రుణాలు పూర్తిగా రద్దుచేయాలి
- కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య డిమాండ్



మంగళాపురంలో దెబ్బతిన్న వరిపొలాన్ని పరిశీలిస్తున్న రావుల వెంకయ్య

చల్లపల్లి, సెప్టెంబరు 11 : వరద, అధిక వర్షాల కారణంగా నష్టపోయిన రైతుల రుణాలను పూర్తిగా రద్దుచేయాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చల్లపల్లి మండలం వెలివోలు, మంగళాపురం గ్రామాల్లో బుధవారం పర్యటించి వరదలు, వర్షాల కారణంగా నీటమునిగిన వాణిజ్య పంటలు, పట్టుపురుగుల షెడ్లు, పొలాలను పరిశీలించారు. రైతులను పరామర్శించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, బుడమేరు పొంగి విజయవాడ నగరం ముంపునకు గురైతే, వరదలు, వర్షాల కారణంగా నదీపరీవాహక ప్రాంతాల్లో రైతాంగం తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇంతటి ఘోరవిపత్తు సంభవించినా కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ జాతీయ విపత్తుగా ప్రకటించకపోవటం బాధాకరమన్నారు. వెలివోలులో పట్టు రైతులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలనీ, ఒక్కొక్క షెడ్డుకు రూ.నాలుగు లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. తమ భూములు ఆన్‌లైన్ చేయలేదని రైతులు చెబుతున్నారనీ, భూపోరాట యోధుడు చండ్ర రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పంపిణీ జరిగిన భూములను ఇప్పటివరకు ఆన్‌లైన్ చేయకపోవటం అధికారుల తప్పిదం కాదా అని ప్రశ్నించారు. తక్షణమే భూములను ఆన్‌లైన్ చేయాలనీ, నిబంధనలు సడలించి ప్రభుత్వం వారిని ఆదుకోవాలన్నారు. వరికి ఎకరాకు రూ.50వేలు, వాణిజ్య పంటలైన అరటి, కంద, పసుపు పంటలకు ఎకరాకు రూ. లక్ష పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వరదలలో ఇప్పటి వరకు సుమారు 40 మంది చనిపోయారనీ, ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల చొప్పున పరిహారం అందించి ఆ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్నీడు యలమందరావు, పరుచూరి శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతుసంఘం నేతలు హనుమానుల సురేంద్రనాద్ బెనర్జీ, గుత్తికొండ రామారావు, వేమూరి రత్నగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు సహకరించాలి

- ప్రభుత్వ అదనపు కార్యదర్శి నివాస్



విజయవాడ లీగల్ : వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఆర్థిక పునర్నిర్మాణ ప్యాకేజీ ద్వారా వీలైనంత అధిక మద్దతు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, ప్రభుత్వ రంగ, ప్రైవేటు బ్యాంకులు బాధిత ప్రజలకు భరోసా కల్పించడంలో కీలక భాగస్వాములు కావాలని రాష్ట్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి (ఫైనాన్స్) జె.నివాస్, కలెక్టర్ సృజన కోరారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో వారు బ్యాంకర్లతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు ఆర్‌బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా వరద ప్రభావిత ప్రజలకు బ్యాంకుల ద్వారా అందించాల్సిన సహాయ సహకారాలకు ప్రతిపాదనల రూపకల్పనపై చర్చించారు. ఈ సందర్భంగా నివాస్ మాట్లాడుతూ, వరద వల్ల నష్టపోయిన ప్రజలకు తగిన సహాయం అందించి, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. ఇందుకు ఆర్‌బీఐతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. రుణాల రీషెడ్యూలింగ్, వినియోగ రుణాల్లో వెసులుబాటు, కొత్త రుణాల మంజూరుకు సంబంధించి వరద ప్రభావిత ప్రాంతాల్లోని బ్యాంకు శాఖలు తమ పరిధిలో ఇప్పటికే వివిధ రకాల రుణాలు పొందినవారు, వినియోగ రుణాలు పొందిన వారు, రుణాల మొత్తం, రుణ ఖాతాలు, జరిగిన నష్టం విలువ తదితర వివరాలతో సమాచార నిధి (డేటా బేస్) రూపొందించాలని, ఇందుకు తమ సర్వేయర్స్, అసెసర్స్ వంటి ఫీల్డ్ సిబ్బందిని ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ యంత్రాంగం నుంచి కూడా సమాచారం అందుబాటులో వుంటుందని, ఈ మొత్తం సమాచారాన్ని మదించి పునర్నిర్మాణ ప్యాకేజీపై ప్రతిపాదనలు రూపొందాల్సి వుందని నివాస్ వివరించారు.

సమష్టి భాగస్వామ్యంతో భరోసా..

కష్టాల్లో వున్నవారిని గట్టెక్కించడంలో ప్రభుత్వ యంత్రాంగంతో బ్యాంకులు కలిసి రావాలని కలెక్టర్ జి.సృజన తెలిపారు. ముఖ్యమంత్రి బ్యాంకులు, బీమా సంస్థలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారని, త్వరలో ఆయన అధ్యక్షతన మరో సమావేశం వుంటుందని కలెక్టర్ వివరించారు. సమావేశంలో ఎల్‌డీఎం కె.ప్రియాంక, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

అందరినీ ఆదుకుంటాం

- కష్టమొచ్చిన ప్రతి ఒక్కరి నష్టాన్ని గణిస్తాం
- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- ఎన్యూమరేషన్ బృందాన్ని పంపి నష్టాన్ని నమోదు చేస్తాం
- అన్ని విధాలా సహాయ సహకారాలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



విజయవాడ లీగల్, సెప్టెంబరు 11 : విజయవాడ పరిసర ప్రాంత వరద ప్రభావిత ప్రాంతాల్లో గృహాలకు, వ్యాపార వాణిజ్య ఆస్తులకు జరిగిన నష్టాన్ని యాప్‌లో నమోదు చేసే ప్రక్రియ అర్బన్ ఏరియాలో దాదాపు పూర్తికావచ్చిందని, గ్రామీణ ప్రాంతంలోను శరవేగంగా జరుగుతోందని, అయితే ఇంకా ఎవరైనా మిగిలివుంటే వారు ఈనెల 12న తమ పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయాన్ని సంప్రదిస్తే ఎన్యూమరేషన్ బృందాన్ని పంపి నష్ట నమోదు చేయడం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతూ, వరద ప్రభావం నుంచి 32 వార్డులు, ఐదు గ్రామాల్లో రక్షణ, ఉపశమన చర్యలు విజయవంతంగా పూర్తిచేయడం జరిగిందని, ఇప్పుడు పునరావాస చర్యలను ప్రణాళికాయుతంగా చేపడుతున్నట్టు వెల్లడించారు. ఈనెల 9వ తేదీన నష్ట నమోదు ప్రక్రియ ప్రారంభించామని, బాధితులను ముంపు నష్టాల నుంచి బయటపడేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకాలను అనుగుణంగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. దాదాపు 2,32,000 కుటుంబాలకు సంబంధించిన నష్ట గణాంకాలను నమోదు చేయడం జరుగుతోందని, ఒకవేళ ఇల్లు విడిచి బయటకు వెళ్లినా, ఎన్యూమరేషన్ బృందం ఇంటికి వచ్చినప్పుడు అందుబాటులో లేకున్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈనెల 12వ తేదీన తమ పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు. నష్ట గణనకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా టోల్ ఫ్రీ నెంబర్లలో సబ్ కలెక్టర్ కార్యాలయం (0866-2574454), విజయవాడ మున్సిపల్ కార్యాలయం (8181960909) సంప్రదించి ఎన్యూమరేషన్‌ను పూర్తిచేయించుకోవచ్చని వివరించారు. నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు తదితర ప్రాంతాల్లోనూ నష్ట గణనను మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తిచేస్తామని కలెక్టర్ సృజన తెలిపారు.

అన్ని విధాలా అండగా..

రిలీఫ్ అంటే కేవలం ఆహారం, ఆర్థిక సహకారమే కాకుండా బాధితులకు ఎన్ని విధాలా సహాయం అందించాలో అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాధితులకు చేసే సహాయం రియాక్టివ్‌గా కాకుండా ప్రో యాక్టివ్‌గా (క్రియాశీలంగా) వుండాలని ముఖ్యమంత్రి నిర్దేశించారని, ఈ క్రమంలోనే బాధితుల వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఎలక్ట్రికల్ రిపేర్లు వంటివి చాలా తక్కువ ధరలో చేయించడం జరుగుతోందని, అవసరమైతే ప్రభుత్వమే రాయితీతో ఇవన్నీ చేయించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితుల సౌకర్యార్థం అందుబాటులో వుంచిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని అందరూ సమిష్టిగా విజయవాడను పూర్వస్థితికి తీసుకొచ్చేందుకు కృషి చేద్దామని కలెక్టర్ సృజన పిలుపునిచ్చారు.

అర్బన్‌లో 90 శాతం నిత్యావసరాల కిట్ల పంపిణీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వరద బాధితులకు నిత్యావసర కిట్ల పంపిణీని సివిల్ సప్లయిస్ అధికారులు వేగవంతం చేశారు. బుధవారం నాటికి విజయవాడ అర్బన్‌లో 90 శాతం కిట్లను పంపిణీ చేశారు. బుధవారం నాటికి 2.20లక్షల కిట్లను పంపిణీ చేశారు. ఇంకా కేవలం 14 వేల కిట్లను పంపిణీ చేస్తే నూరుశాతం పూర్తి అవుతుంది. బుధవారం నుంచి గ్రామీణ ప్రాంతాలలో మరో 33 వేల కిట్ల పంపిణీకి ఎన్టీఆర్ జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు చర్యలు చేపట్టారు. జగ్గయ్యపేట, నందిగామ, విజయవాడ రూరల్, తిరువూరు వంటి ప్రాంతాలలో వరద ప్రభావానికి గురైన ప్రాంతాలకు సంబంధించి నిత్యావసరాల కిట్ల పంపిణీని చేపట్టారు. గురువారం నాటికి నూరు శాతం కిట్ల పంపిణీని అధికారులు పూర్తి చేయనున్నారు.

లంక గ్రామాల్లో నష్టం ప్రభుత్వం దృష్టికి..

- ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు

మోపిదేవి : వరదల కారణంగా వాణిజ్య పంటలు నష్టపోయిన ప్రతీ రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబులు తెలిపారు. బుధవారం మండలంలోని వరద ప్రభావిత గ్రామమైన బొబ్బర్లంకలో వరదల కారణంగా దెబ్బతిన్న పంటలు, తడిసిన పసుపును వారు పరిశీలించారు. ప్రతీ రైతుకు న్యాయం జరిగేలా త్వరలో సమగ్ర నివేదిక ఏర్పాటు చేసి ప్రభుత్వం ఆదుకుంటుందని వారు స్పష్టం చేశారు. బొబ్బర్లంక, కొత్తపాలెం గ్రామాలకు ఈ-క్రాప్ చేయలేదని ప్రభుత్వం అందించే సహాయం రైతులకు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కృష్ణానది వరద ముంపునకు గురైన అర్బన్ ప్రాంతాల్లో ప్రకటించిన ప్రభుత్వ సహాయం లంక గ్రామాల ముంపు బాధితులకు వర్తింపచేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం ఎన్ఆర్ఐ టీడీపీ విభాగం ఆధ్వర్యంలో మోపిదేవి మండలంలోని బొబ్బర్లంక వరద బాధితులకు సహాయాన్ని బుధవారం వారు పంపిణీ చేశారు. బొబ్బర్లంక గ్రామంలోని 300 కుటుంబాలకు దుస్తులు, దుప్పట్లు టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం ఆధ్వర్యంలో వారు పంపిణీ చేశారు.



బొబ్బర్లంకలో తడిసిన పసుపును పరిశీలిస్తున్న బుద్ధప్రసాద్, అశోక్‌బాబు తదితరులు



వృద్ధ దంపతులు వెంకటరత్నం, మణెమ్మ

బిడ్డ జాడ చెప్పరూ!

- తనయుడి కోసం వృద్ధ దంపతుల వేదన..



తిరువూరు : కనిపించకుండా పోయిన కుమారుడి కోసం వృద్ధ దంపతులు ఎదురుతెన్నులు చూస్తున్నారు. అతడి ద్విచక్ర వాహనం ఏట్లో లభించడంతో కుమారుడు ఏమయ్యాడోనని ఆందోళన చెందుతున్నారు. వివరాల ప్రకారం.. మండలంలోని వావిలాల శివారు రాజుగూడెంకు చెందిన కౌలురైతు కోట వెంకట్రావు(45), ఆగస్టు 31న పని నిమిత్తం వెళుతున్నట్టు చెప్పి వెళ్లాడు. ఇప్పటి వరకు అతడి అచూకీ తెలియటం లేదు.. స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం.. అని వృద్ధ దంపతులు కోట వెంకటరత్నం, మణెమ్మలు చెబుతున్నారు. తమకు ఆధారం కుమారుడే అని కన్నీటి పర్యంతమవుతున్నారు. కోడలు కోటకుమారి(మరియమ్మ) ఏడాది క్రితం కేన్సర్‌తో మృతి చెందింది. వృద్ధులైన తల్లిదండ్రుల్ని చూసుకుంటు, కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడు. ఈనెల 5న చింతలపాడు వాగులో చేపలు పట్టేందుకు కొందరు వలలు వేయగా వెంకట్రావు ద్విచక్ర వాహనం బయటపడింది. కొడుకు వాగులో కొట్టుకుపోయాడా, లేక ఎక్కడైనా క్షేమంగా ఉన్నాడా తెలియక వృద్ధ దంపతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని, వాగులో ద్విచక్రవాహనం లభ్యమవడంతో వాగు పరిసరాల్లో వెంకట్రావు అచూకి కోసం గాలింపు కొనసాగుతోందని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

బొడ్డు రాయి చోరీపై ఫిర్యాదు

విస్సన్నపేట : పుట్రేల శివారు జానలగడ్డ గ్రామంలో ముత్యాలమ్మ తల్లి గుడి ప్రదేశంలో కోట్లాది రూపాయల విలువగల బొడ్డు రాయి చోరీపై పూర్తి విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మంగళవారం ఎస్ఐ పి.రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. విలువైన రాయి మాయమైన ఘటనలో కోట్లు చేతులు మారినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అపార నష్టం.. ఆదుకోండి

(5వ పేజీ తరువాయి)

వరద కారణంగా నీటిమునిగిన పంటపొలాలను, చేపలచెరువులకు సంబంధించిన డ్రోన్ విజువల్స్‌ను కేంద్ర బృందంసభ్యులు పరిశీలించారు. పెనమలూరు నియోజకవర్గంలోని యనమలకుదురు, పులిపాక, చోడవరం, మద్దూరు గ్రామాల్లో కేంద్రబృందం సభ్యులు పర్యటించి కృష్ణానదికి వచ్చిన వరద కారణంగా దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, కంద, అరటి పంటలను, దెబ్బతిన్న గృహాలను పరిశీలించారు. ఎమ్మెల్యే బోడే ప్రసాద్ నష్టపోయిన పంటలను కేంద్రబృందం సభ్యులకు చూపారు.

జాతీయ విపత్తుగా ప్రకటించండి

వరద కారణంగా లక్షలాది ఎకరాల్లో వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయసమితి ఆధ్వర్యంలో మద్దూరులో వ్యవసాయశాఖ మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతుసంఘాల నాయకులు కేంద్ర బృందం సభ్యులకు వినతిపత్రం అందజేశారు. 35 మంది వరదల కారణంగా చనిపోయారని, వేలాది కుటుంబాలు నిరాశ్రయులై పునరావాస శిబిరాల్లో తలదాచుకోవాల్సి వచ్చిందని వినతిపత్రంలో వివరించారు. రూ.10వేల కోట్లను నష్టపరిహారంగా అందజేయాలని వినతిపత్రంలో కోరారు. బుడమేరు వరద ఉధృతిని ఆపేందుకు అవసరమై ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు, వంతెనలు. గట్లను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్నివిధాల ఆదుకోండి : ఎంపీ బాలశౌరి

వరదల కారణంగా జిల్లాలో అన్ని రంగాలు దెబ్బతిన్నాయని, ఈ నష్టాన్ని భర్తీచేసేందుకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల చేయాలని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి కేంద్రబృందాన్ని కోరారు. తాడేపల్లిలోని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో కేంద్రబృందం సభ్యులను ఆయన కలిశారు. వరద కారణంగా అవనిగడ్డ నియోజకవర్గం గొల్లమంద-జింకపాలెం రహదారి పూర్తిగా దెబ్బతిందని, ఇందుకు సంబంధించిన ఫొటోలను చూపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.25

ముంపు గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం

ఉంగుటూరు, సెప్టెంబరు 11 : భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా అధికారులు, సర్పంచ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేశారు. బుడమేరుకు వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ఎలుకపాడు, ముక్కపాడు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, వేంపాడులోని పలు పల్లపు ప్రాంతాల్లో నీట మునిగిన ఇళ్లు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో అంటువ్యాధులు విజృంభించే అవకాశమున్నందున పంచాయతీ అధికారులు ప్రత్యేక శానిటేషన్ చర్యలు చేపట్టారు. వెల్దిపాడులో సర్పంచ్ లాం నాగేశ్వరరావు నేతృత్వంలో పారిశుధ్య సిబ్బంది గ్రామంలోని డ్రైనేజీలు, అంతర్గత రోడ్లవెంట పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ జల్లే పనులు నిర్వహించారు.

జంక్షన్ నుంచి గుడివాడకు నిలిచిన రాకపోకలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 11 : ఆరుగొలను వద్ద బుడమేరు వరద ప్రవాహం ఉధృతంగా ఉండటంతో జంక్షన్ నుంచి గుడివాడ వైపునకు రాకపోకలను నిలిపేసినట్టు ఎస్సై జనార్దన్ బుధవారం తెలిపారు. గుడివాడ అత్యవసరంగా వెళ్లాల్సిన వారు విజయవాడలోని తాడిగడప మీదుగా ప్రయాణించాలని సూచించారు.



ఆరుగొలను వద్ద బుడమేరు వరద



రొయ్యూరులో కేంద్ర బృందానికి రైతుల ఇబ్బందులు వివరిస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి



మద్దూరులో కేంద్ర బృందానికి పంట నష్టాన్ని వివరిస్తున్న మాజీ మంత్రి వడ్డే, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, దేవినేని రాజా

వరద నష్టంపై సమగ్ర పరిశీలన

- పెనమలూరు, కంకిపాడు మండలాల్లో పర్యటించిన కేంద్ర బృందం
- యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం, మద్దూరులో నష్టపోయిన పంటల పరిశీలన
- నష్టం వివరాలు వివరించిన కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్



యనమలకుదురులో వరదల వల్ల జరిగిన నష్టాన్ని కేంద్ర బృందానికి వివరిస్తున్న స్థానికులు

పెనమలూరు/ కంకిపాడు, సెప్టెంబరు 11 : కృష్ణాజిల్లాలో వరద నష్టాన్ని అంచనా వేసే పనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ అధికారుల ప్రత్యేక బృందం పెనమలూరు మండలంలోని యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాల్లో పర్యటించింది. బృంద సభ్యులు యనమలకుదురు నుంచి పెదపులిపాక దారిలో రైతులు నష్టపోయిన వరి పంటలను పరిశీలించారు. పెదపులిపాకలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలించి వరదలకు మునిగిన ఇళ్లు, సమగ్ర మంచినీటి పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. చోడవరంలో బొప్పాయి, అరటి, కంద లాంటి పంటలను పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జిల్లా కలెక్టర్ బాలాజీలు కేంద్ర బృందానికి వరద నష్ట తీవ్రతను వివరించారు. కేంద్ర బృందంలో కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి అనిల్ సుబ్రమణియం, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రాంతీయ కార్యాలయం చీఫ్ ఇంజనీర్ రాకేష్‌కుమార్, ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌వీఎస్‌పీ శర్మ ఉన్నారు. ● వరదల్లో నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలని సీపీఎం నాయకులు కేంద్ర బృందానికి వినతి పత్రాన్ని అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఎం నాయకులు ఉప్పాడ త్రిమూర్తులు, కాసిం, మస్తాన్‌వలి, తదితరులు ఉన్నారు. ● బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్, జిల్లా అధ్యక్షులు గోపిశెట్టి దుర్గాప్రసాద్‌లు పెదపులిపాక, చోడవరం, రొయ్యూరుల్లో కేంద్ర బృందంతో కలిసి పర్యటించారు. వరదల వల్ల రైతులు నష్టపోయిన పంట వివరాలను, దెబ్బతిన్న గృహాల వివరాలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రైతాంగానికి పూర్తి నష్టపరిహారాన్ని అందించాలని కోరారు.

● కంకిపాడు మండలంలోని మద్దూరు గ్రామంలో వరద నష్టం అంచనా వేసేందుకు కేంద్ర బృందం బుధవారం పర్యటించింది. కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లు వరదల వల్ల జరిగిన నష్టాన్ని కేంద్ర బృందానికి వివరించారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, పంచకర్ల రంగారావు, కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజాలు కేంద్ర బృందాన్ని కలిసి ఇటువంటి విపత్తును చూడలేదని, పలు పంట కాలువలు అభివృద్ధి చేయాల్సిన అవసరముందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజు, తహసీల్దార్ భవన్నారాయణ, వ్యవసాయ శాఖ అధికారి పి.ఎం. కిరణ్, మాజీ వైస్ ఎంపీపీ కోయా ఆనంద్, తాడిగడప మునిసిపాలిటి అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్, యనదల వెంకటేశ్వరరావు, రావి అప్పారావు, సర్పంచ్ చిప్పల దాసు, వల్లే నరసింహారావు, తీట్ల మధు పాల్గొన్నారు

పశు పోషకులకు దాణా పంపిణీ

ఉంగుటూరు, సెప్టెంబరు 11 : వరద ప్రభావిత ప్రాంతాల్లో పశుపోషకులను ఆదుకోవాలనే సంకల్పంతో రాష్ట్రప్రభుత్వం సమీకృతదాణా మిశ్రమాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు అల్లాపురం ప్రాంతీయ పశువైద్యకేంద్రం సహాయ సంచాలకులు (ఏడీ) డాక్టర్ కె.రాధాకృష్ణమూర్తి అన్నారు. మండలంలోని లంకపల్లి, ముక్కపాడు, ఓంద్రంపాడు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, ఎలుకపాడు గ్రామాల్లో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం సమీకృత దాణా మిశ్రమాన్ని ప్రతిరైతుకు 25 కిలోలు చొప్పున ఉచితంగా అందజేశారు. ఆముదాలపల్లిలో జరిగిన పశుదాణామిశ్రమం పంపిణీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇందుపల్లి, ఉంగుటూరు, తేలప్రోలు ప్రభుత్వ పశువైద్యాధికారులు డాక్టర్ జి.సుధీర్‌బాబు. డాక్టర్ జి.స్వర్ణలత, డాక్టర్ సీహెచ్ మల్లిబాబు, మానికొండ వీఎల్‌వో ఎస్.శ్రీనివాసు, జేవీవో ఆర్‌వీ ఫణికుమార్ పాల్గొన్నారు.

డాక్టర్ పద్మలతకు విశిష్ట పురస్కారం

గన్నవరం, సెప్టెంబరు 10 : ఎనికేపాడు ఎస్ఆర్‌కే ఫౌండేషన్ వారి విజయ మహిళా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలతకు విద్యారంగంలో విశిష్ట సేవలందించినందుకుగాను కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ (సీఎస్సీ) వారిచే విశిష్ట పురస్కారం లభించింది. ఈ మేరకు బుధవారం ఆమెను కళాశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మలత మాట్లాడుతూ, పురస్కారం రావటం సంతోషంగా ఉందన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి కార్మికుడు దుర్మరణం

ఉయ్యూరు, సెప్టెంబరు 11 : ఉయ్యూరులో ప్రధాన సెంటర్ సమీపాన అపార్ట్‌మెంట్ పనిచేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి కార్మికుడు బుధవారం మృతి చెందాడు. పట్టణ పోలీసుల వివరాల ప్రకారం.. తోట్లవల్లూరు మండల గరికపర్రు కు చెందిన బండి సుబ్బారావు(57) లింగమూర్తి సెంట్రల్ అపార్ట్‌మెంట్‌లో పనిచేసేందుకు వచ్చి తాడుకట్టిన బల్లపై కూర్చుని అపార్ట్‌మెంట్ వెలుపల గోడలపై పెరుగుతున్న మొక్కలు తొలగిస్తూ జారి కిందపడి అక్కడి కక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సుబ్బారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యాన పంటలకు అపార నష్టం



బొమ్ములూరులో వరద నీటికి దెబ్బతిన్న కూరగాయల మొక్కల నర్సరీ

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 11 : ఇటీవల కురిసిన అధిక వర్షాలకు బాపులపాడు మండలంలో ఉద్యాన పంటలకు అపార నష్టం వాటిల్లింది. దాదాపు వారం రోజులు పాటు వర్షం కురవడంతో పాటు మండలంలో 35 ఎకరాల్లో సాగు చేస్తున్న కూరగాయాలు తోటలు, కూరగాయ నర్సరీలకు భారీ నష్టం సంభవించింది. మండలంలో కొత్తపల్లి, బిళ్లనపల్లి, మడిచర్ల, అంపాపురం, బొమ్ములూరు గ్రామాల్లో సాగవుతున్న బీర, కాకర, దొండ, బొప్పాయి,మునగ తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కొత్తపల్లి, బిళ్లనపల్లి, మడిచర్ల, అంపాపురం గ్రామాల్లో అధిక వర్షానికి కూరగాయ తోటలు వేరు కుళ్లి మొక్కలు చనిపోయాయి. రామిలేరు వాగు పొంగి జాతీయ రహదారిపై ప్రవహించడంతో బొమ్ములూరు వద్ద రహదారి పక్కనే ఉన్న సూర్య నర్సరీ ముంపునకు గురైంది. నర్సరీలో 30లక్షలు కూరగాయ మొక్కల నారు కుళ్లిపోయింది. దాదాపు రూ.25లక్షలు నష్టం వాటిల్లినట్లు నర్సరీ యజమాని రత్నాకర్ తెలిపారు. అంపాపురంలో గ్రామానికి చెందిన మధుబాబు 10 ఎకరాల్లో సాగు చేసిన మునగ తోట వేరు కుళ్లతో చనిపోయింది.

బుడమేరులో ఒకరి గల్లంతు

గన్నవరం, సెప్టెంబరు 11 : మండలంలోని కేసరపల్లి శివారు చెంచుల కాలనీకి చెందిన నల్లమోతు నాగరాజు (44) గూడవల్లి వద్ద బుడమేరులో గల్లంతయ్యాడని స్థానికులు చెబుతున్నారు. బుధవారం ఉదయం అతనితో పాటు మరో ముగ్గురు చేపలు పట్టేందుకు బుడమేరు వద్ద వేటకు వెళ్లారు. అయితే సాయంత్రం మిగిలిన ముగ్గురు బయటకు వచ్చినప్పటికీ నాగరాజు రాలేదు. దీంతో బుడమేరులో కొట్టుకుపోయి ఉంటాడని పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



ఉయ్యూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిలిచిన వర్షపు నీటిని ఇంజన్‌తో తోడుతున్న సిబ్బంది

వర్షపు నీరు తొలగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఉయ్యూరు, సెప్టెంబరు 11 : ఉయ్యూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిలిచి దుర్గంధం వ్యాపిస్తున్న వర్షపు నీటిని బుధవారం ఇంజనుతో తోడి తొలగింపు చర్యలను డిపో అధికారులు చేపట్టారు. బస్టాండ్ చుట్టూ వర్షపునీరు పోయే మార్గంలేక నిలిచి చెత్తా చెదారం కుళ్లి దుర్గంధం వ్యాపిస్తున్న నేపథ్యంలో 'ముంపువీడని ఉయ్యూరు బస్టాండ్' శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన డిపో అధికారులు ఇంజన్‌తో తోడిస్తున్నారు.

వరద బాధితులకు అండగా దాతలు



ఓగిరాలలో తానా కిట్ల పంపిణీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 11 : బాపులపాడు మండలంలో వరద ఉధృతి బుధవారం కూడా కొనసాగింది. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపు మేరకు దాతల సహకారంతో ప్రభుత్వ పునరావాస కేంద్రాలను నిర్వహిస్తున్నారు. రామన్నగూడెంలోని పునరావాస కేంద్రంలో అవిర్నేని వెంకటేశ్వరరావు భోజన ఏర్పాట్లు చేశారు.ఓగిరాలలోని బాధితులకు రంగన్నగూడెం గ్రామ ప్రజల సహకారంతో ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో భోజన వితరణ నిర్వహించారు. ఆరుగొలను, రంగయ్యప్పారావుపేట తదితర గ్రామాల్లోని పునరావాస కేంద్రాల్లో దాతల సహకారంతో బాధితులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ● కష్టకాలంలో బాధితులకు సహాయం చేయడమే నిజమైన విద్య లక్ష్యమని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షురాలు జగతి అన్నారు. ఆరుగొలను పునరావాస కేంద్రంలోని వరద బాధితులకు ఉపాధ్యాయులతో కలిసి బుధవారం ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ● గ్రామాభి వృద్ధితో పాటు విపత్కర పరిస్థితుల్లో ఉన్న ప్రజలకు సజ్జా శ్రీనివాసరావు అండగా నిలబడటం అభినందనీయమని ఓగిరాల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మేడికొండ రాయుడు అన్నారు. అమెరికాలో నివాసముంటున్న శ్రీనివాసరావు స్వగ్రామం ఓగిరాల వరద ముంపునకు గురైందని తెలుసుకుని తన వంతు సహకారంగా తానా ద్వారా 10 వస్తువులతో కూడిన 100 నిత్యావసరాల కిట్లను బుధవారం అందజేశారు.

హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులకు బుధవారం పాఠశాల అభివృద్ధి కమిటీ భోజన ఏర్పాట్లు చేసింది. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సుంకర సుభాష్‌చంద్రబోస్, కార్యదర్శి వీరమాచనేని సత్యప్రసాద్, కమిటీ సభ్యులు దుట్టా శివనారాయణ, సర్పంచ్ సరిపల్లి కమాలాబాయి, లయన్స్ క్లబ్ నాయకులు తాడి రంగారావు, ఈవో చోరగుడి ప్రసాద్, వీఆర్వో చైతన్యకుమార్ పాల్గొన్నారు.

ముగిసిన యోగాసన పోటీలు



విజేతలతో నిర్వాహకులు

ఉయ్యూరు, సెప్టెంబరు 11 : యోగాతో ఆరోగ్యం, ఆహ్లాదం సాధ్యమని ప్రముఖ న్యాయవాది, టీడీపీ నాయకుడు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ అన్నారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అవనిగడ్డ ఆధ్వర్యంలో గండిగుంట దత్తాత్రమంలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగాసన చాంపియన్ పోటీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు బస్‌పాస్‌లు అందజేత



కాటూరు(ఉయ్యూరు), సెప్టెంబరు 11 : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కాటూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 100 మంది విద్యార్థినులకు ఉచిత బస్‌పాస్‌లు బుధవారం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ జోనల్ ఛైర్‌పర్సన్ ఎండీ ఇస్మాయిల్, ప్రముఖ పారిశ్రామికవేత్త బారుకాటి ప్రసాద్‌రాజు పాల్గొని విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. క్లబ్ సెక్రటరీ నెల్లి రాంబాబు, ట్రెజరర్ దినవహి ప్రసాద్, లయన్స్ ప్రతినిధులు శ్రీనివాస్, అహ్మద్, ఆర్టీసీ ఉద్యోగి శివన్నారాయణ, పాఠశాల హెచ్ఎం రమాదేవి పాల్గొన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థినికి క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ ఆధ్వర్యంలో సైకిల్‌ను పారిశ్రామికవేత్త బారుకాటి ప్రసాద్‌రాజు అందజేశారు.

ముస్తాబాదలో పంట నష్టం నమోదు

గన్నవరం, సెప్టెంబరు 11 : మండలంలోని ముస్తాబాదలో దెబ్బతిన్న వరి పంటను ఎన్యూమరేషన్ ప్రాసెస్ మండల ఏవో ఎన్ లక్ష్మీతేజస్వీ బుధవారం పరిశీలించారు. గ్రామంలో మొత్తం 3,300 ఎకరాలు వరి పంట సాగు చేయగా ప్రిలిమినరీ డ్యామేజ్ కింద 2,300 ఎకరాలు గుర్తించటం జరిగిందన్నారు. గత 11 రోజులుగా వరి పంట నీట మునగటం వల్ల రైతులకు పూర్తి నష్టం జరిగిందన్నారు. పంట నష్ట పరిహార ప్రక్రియ ముగిసిందన్నారు.

బాధితులందరికీ నిత్యావసరాలు అందించండి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, సెప్టెంబరు 11 : నియోజకవర్గంలోని వరద బాధితులు అందరికీ ప్రభుత్వం నుంచి పరిహారంతో పాటు నిత్యావసర సరుకులు వెంటనే అందజేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తహసీల్దార్‌లను ఆదేశించారు. బుధవారం రాత్రి గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్, గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండల తహసీల్దారులతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వరద నష్టం జరిగిన గ్రామాల్లో ఎన్యూమరేషన్ జరుగుతున్న తీరు, బాధితులకు నిత్యావసరాలు పంపిణీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంట నష్టం వివరాలు నమోదు పక్కాగా జరగాలన్నారు. నష్టపోయిన బాధితులు అందరి వివరాలు నమోదు చేయాలని సూచించారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు బాధితులందరికీ అందటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని తక్షణమే పునఃపరిశీలన చేసి బాధితులు అందరికీ నిత్యావసర సరుకులు అందించాలని ఆదేశించారు. వరదనీటిలో మునిగి దెబ్బతిన్న మోటారు సైకిళ్లు, కార్లు ఇతర మోటార్ వాహనాల వివరాలు నమోదు చేయాలన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.25

బందరులో ఇంటింటికీ కుళాయి

● 30లోపు దరఖాస్తు చేసుకోండి: కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 11: నగరంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తున్నామని, యజమానులు ఈనెల 30వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు సూచించారు. కుళాయి కనెక్షన్‌కు ఉచితంగా పైపులు వేస్తామని ఆయన తెలిపారు. అన్ని సచివాలయాల్లో కనెక్షన్‌కు దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆధార్ కార్డు, ఇంటి పన్ను రశీదు, ఆస్తి ధ్రువీకరణ జిరాక్స్ కాపీలు , ఇంటి పన్ను బకాయిలను పూర్తిగా చెల్లించి ఆ రశీదు జిరాక్స్ కాపీని పూర్తి చేసిన దరఖాస్తులకు జతచేసి ఇంజనీరింగ్ విభాగంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు అందించాలని ఆయన సూచించారు.

నానో మెటీరియల్స్‌పై విస్తృత పరిశోధన

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 11: దేశంలోని పలు విశ్వవిద్యాలయాల్లో నానో మెటీరియల్స్‌పై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని జేఎన్టీయూ హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ బి. రమాదేవి తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో బుధవారం విద్యార్థులకు నానో మెటీరియల్స్ తయారీపై ఆమె అవగాహన కల్పించారు. యూనివర్సిటీ స్థాయి నుంచే పరిశోధనా అంశాలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు, రసాయన శాస్త్ర విభాగాధిపతి డి.రామశేఖరరెడ్డి, రవి, అనిల్‌కుమార్, పుష్పలత పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం

● ముంపు బారిన పడిన లంక గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తాం: ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

నాగాయలంక, సెప్టెంబరు 11: వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని గ్రామస్థులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. బుధవారం నాగాయలంక చిన్నకరకట్ట కింద కోతకు గురైన మత్స్యకార భవనం ప్లాట్‌ఫామ్‌ను ఆయన పరిశీలించారు. ముంపు బారిన పడిన గృహాలను సందర్శించి, ప్రజలను పరామర్శించారు. కూటమి నేతలు పాల్గొన్నారు.



నాగాయలంకలో కోతకు గురైన మత్స్యకార భవన ప్లాట్‌ఫామ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



బొబ్బర్లంకలో పసుపును ఆరబెడుతున్న కూలీలు

కూలిన ఇళ్ల స్థానంలో పక్కా గృహాల నిర్మాణానికి కృషి

చల్లపల్లి: వరద ముంపు బారిన పడిన నియోజకవర్గంలోని ఐదు లంక గ్రామాల్లో రూ.ఐదు కోట్లతో సీసీ రోడ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వరద బారిన పడిన లంక గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తోందని తెలిపారు. లంక గ్రామాల్లో వాణిజ్య పంటలకు జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో నమోదు చేసి రైతాంగాన్ని ఉదారంగా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కూలిన ఇళ్ల స్థానంలో పక్కా గృహాల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. జరిగిన అపారనష్టాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం భారీగా సహాయాన్ని అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కరకట్ట ఎత్తు పెంచాలి

కృష్ణా కరకట్టను పటిష్టపరచాల్సిన అవసరం ఉందని మండలి బుద్ధప్రసాద్ అభిప్రాయపడ్డారు. 11 లక్షల క్యూసెక్కుల వరకు వరదను తట్టుకునేలా కరకట్ట నిర్మాణం జరిగిందని, కానీ అంతకంటే ఎక్కువ వచ్చినా తట్టుకునేలా కరకట్టను పటిష్టపరిచి ఎత్తు పెంచాలని ఆయన పేర్కొన్నారు.

తడిసిన 400 క్వింటాళ్ల పసుపు

మోపిదేవి: కృష్ణానది వరదల కారణంగా బొబ్బర్లంక గ్రామం పూర్తిగా జలమయమైంది. గత ఏడాది సాగుచేసి పండించిన పసుపు పంటకు తగిన గిట్టుబాటు ధర లేకపోవటంతో గ్రామంలోని గోడౌన్లలో నిల్వ చేశారు. వరదల్లో గ్రామానికి చెందిన బలరామకృష్ణ 8 ఎకరాల్లో పండించిన 400 క్వింటాళ్ల పసుపు వరదల కారణంగా తడిసింది. వరదల అనంతరం రెండు రోజులుగా ఎండలు వేయడంతో రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో ఆరబెట్టి కూలీలతో ఎండబెట్టిస్తున్నారు. 17 ఎకరాల్లో ఈ ఏడాది సాగు చేసిన పంట మరికొద్ది రోజుల్లో చేతికి అందివస్తున్న తరుణంలో వరదల కారణంగా పంట నీటి ముంపునకు గురైందని తెలిపారు.

వరదలకు తెగిన పైపులైను.. అరకొరగా తాగు, సాగునీరు

నాగాయలంక: వరదల కారణంగా గుంటూరు జిల్లా రాజు కాల్వ- ఎదురుమొండి ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణానది మీదుగా ఎదురుమొండి చెరువుకు వచ్చే రెండు పైపులైన్లలో ఒక పైపులైన్ తెగిపోయిందని గ్రామ పెద్దలు కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, లంకేశ్వరరావు, మోకా శివ శ్రీనివాసరావు, చెన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. రాజు కాల్వ-ఎదురుమొండి ఎత్తిపోతల పథకం ద్వారా ఎదురుమొండి చెరువుకు వచ్చిన నీరుతో ఎదురుమొండి, నాచుగుంట గ్రామాల రైతులకు, ప్రజలకు సాగు, తాగునీరు అందుతోందని, రెండు గ్రామాల్లో 1300 ఎకరాల్లో వరిని సాగు చేస్తున్నారని, ఎనిమిది వేల మందికి తాగునీరు అందుతోందని, ఒక పైపులైన్ తెగిపోవటంతో ఒక పైపులైను నుంచే ప్రస్తుతం నీరు వస్తోందని సాగు, తాగునీరు అరకొరగా అందుతుందని తక్షణమే పైపులైను పునరుద్ధరించాలని వారు కోరారు.



పైపులైన్‌ను చూపుతున్న గ్రామపెద్దలు

బురద తొలగింపు పనులు వేగవంతం

అవనిగడ్డ రూరల్: వరద ముంపు కారణంగా రోడ్లపై చేరిన బురద తొలగింపు పనులను అధికారులు వేగవంతం చేయించారు. పులిగడ్డలో ఆక్విడెక్ట్‌కు వెళ్లే ప్రధాన రహదారిపైన, ఆక్విడెక్ట్‌పై వరద ముంపు కారణంగా పేరుకుపోయిన బురదను జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ సూచనలతో అవనిగడ్డ అగ్నిమాపకశాఖ అధికారి పీఎస్వీఎస్ ప్రసాద్ తన సిబ్బందితో తొలగింపజేశారు. జనసేన నాయకుడు మండలి సుధీర్ పర్యవేక్షించారు.

మత్స్యభవనం ప్లాట్‌ఫాం పునర్నిర్మించాలి

నాగాయలంక: పడవల రేవు వద్ద వరదల కారణంగా ధ్వంసమైన మత్స్యకారుల భవనం ప్లాట్‌ఫామ్‌ను పునర్నిర్మించాలని టీడీపీ జిల్లా కార్యదర్శి లకనం నాగాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మత్స్యకార సంఘాల నాయకులతో కలిసి ధ్వంసమైన ప్లాట్‌ఫామ్‌ను ఆయన పరిశీలించారు. మత్స్యభవనం శ్లాబ్, పిల్లర్లు, అప్రోచ్ రోడ్డు దెబ్బతిన్నాయని తెలిపారు. మత్స్యకారుల నివాసాలు, మత్స్యభవనం భద్రత కోసం శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్ నుంచి పడవల రేవు వరకు రిటైనింగ్ వాల్ నిర్మించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి సమస్యను తీసుకెళ్తానన్నారు. కర్రి కృష్ణమూర్తి, సందాడి నాగరాజు, కొక్కిలిగడ్డ వీర రాఘవయ్య, కె.నరసింహారావు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతుల జాబితాల ప్రదర్శన

ఘంటసాల: ఆగస్టు నెల చివరిలో, సెప్టెంబరు మొదటి వారంలో కురిసిన అధిక వర్షాలకు 33 శాతం పైన పంటన నష్టపోయిన రైతుల వివరాలను మండలంలోని రైతు సేవా కేంద్రాల నోటీసు బోర్డుల్లో 16వ తేదీ వరకు ప్రదర్శిస్తామని ఏవో కె.మురళీకృష్ణ తెలిపారు. జాబితాలపై అభ్యంతరాలుంటే 16వ తేదీలోపు వీఏఏకి అందజేయాలని సూచించారు. పరిశీలించి మార్పులు, చేర్పులు చేసి 17వ తేదీన తుది నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని తెలిపారు. శ్రీకాకుళం, పాపవినాశనం రైతు సేవా కేంద్రాల్లో సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), కుంపటి చిట్టిబాబు, అత్యూరి సీతారామరాజు, సెరికల్చరల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, వీఏఏలు జి.దయానా, ఎం.లావణ్య, రైతులు పాల్గొన్నారు.



ఎంఈవోల సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 11: "రాష్ట్రంలోని స్కూల్ కాంప్లెక్స్‌లను క్లస్టర్ కాంప్లెక్స్‌లుగా తీర్చిదిద్దుతాం. ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసే క్లస్టర్ కాంప్లెక్స్‌లను ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను పెంచే విధంగా రూపొందిస్తున్నాం. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాం." అని విద్యాశాఖ పరీక్షల డైరెక్టర్, కృష్ణాజిల్లా నోడల్ ఆఫీసరు డి.దేవానందరెడ్డి తెలిపారు. బుధవారం డీఈవో కార్యాలయం సమావేశపు హాలులో ఎంఈవోల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీ పోస్టుల భర్తీకి యోచిస్తున్నామన్నారు. కృష్ణాజిల్లాకు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తూ జిల్లాను విద్యారంగంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేద్దామన్నారు. కొందరు ఎంఈవోలు తమ సమస్యలను దేవానందరెడ్డి ముందు ఉంచారు. ఎంఆర్సీ సెంటర్‌లో సీఎంవోల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రెండేళ్లుగా మండల విద్యాశాఖ కార్యాలయాలకు స్టేషనరీ బిల్లులు చెల్లించడం లేదన్నారు. కొందరు ఉపాధ్యాయులు ముందస్తు అనుమతి తీసుకోకుండానే పాఠశాలలకు గైర్హాజరవుతున్నారని మరి కొందరు ఎంఈవోలు తెలిపారు. దీనిపై డీఈవోతో విచారణ జరిపిస్తామన్నారు. పాఠశాలల్లో ఖాళీ పోస్టులను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ద్వారా సర్దుబాటు చేశామని డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. ఏడీలు అజీజ్, నాయక్ పాల్గొన్నారు.

నవోదయలో అడ్మిషన్లు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 11: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26లో 6వ తరగతిలో ప్రవేశించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎంఈవోల ద్వారా ఈనెల 16లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గురుకులం సందర్శన

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 11: పులిగడ్డ గురుకుల విద్యాలయాన్ని ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఎంపీడీవో మరియకుమారి, ఈవోపీఆర్డీ సుందరి సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సర్పంచ్ దాసరి విజయకుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అనిత పాల్గొన్నారు.

వితరణల వెల్లువ



ఆముదార్లంకలో నిత్యావసరాల కిట్లు అందిస్తున్న బుద్ధప్రసాద్, ఐవీఎం డైరెక్టర్ రోజా



తమిరిశలో సరుకులు పంపిణీ చేస్తున్న వెనిగండ్ల రాము

గుడివాడ, సెప్టెంబరు 11: బుడమేరు వరద బాధితులకు పలువురు దాతలు వితరణ అందజేశారు. గుడివాడ పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో రూ.లక్ష విలువైన నిత్యావసర వస్తువులు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి అతని మిత్ర బృందం రూ.లక్ష వితరణ, 1500 మందికి ఆహార ప్యాకెట్లు, గ్రోవెల్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం 3000 మందికి ఆహార ప్యాకెట్లు అందజేశారు. పెదపారుపూడి మండలం మోపర్రులోని పునరావాస కేంద్రంలో అదే గ్రామానికి చెందిన ఉద్యోగులు డీఎస్పీ శుభాకర్, విశ్రాంత సీఐ దేవరపల్లి జాకబ్‌చౌదరి, గుడివాడ ఈవోపీఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు వితరణతో 1500 మందికి భోజన సదుపాయం కల్పించారు.

నందివాడ: పోలుకొండలో వరద బాధితులకు 5 కేజీల బియ్యం, 12 కోడిగుడ్లు, నూనె, పంచదార, కందిపప్పుతో కలిసి మొత్తం 9 రకాల నిత్యావసర వస్తువులను 70 కుటుంబాలకు అందజేసినట్లు పిన్నమనేని రవీంద్ర కుమారుడు బద్రీనాథ్ తెలిపారు.

400 కుటుంబాలకు ఐవీఎం సాయం

చల్లపల్లి: వరద బాధితులకు ఐవీఎం ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆముదార్లంకలో 400 మంది వరద బాధితులకు ఐవీఎం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వేములపల్లి సురేష్, రోజా దంపతుల ఆధ్వర్యంలో రూ.4.80లక్షల విలువైన నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువనేత మండలి వెంకట్రామ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో వరద బాధిత గ్రామాల్లో రూ.12లక్షల వ్యయంతో 1500 మంది బాధిత కుటుంబాలకు సహాయం అందిస్తున్నట్లు ఐవీఎం ట్రస్ట్ డైరెక్టర్ రోజా తెలిపారు. మోర్ల రాంబాబు, నడకుదిటి ఆదిలక్ష్మి, ముమ్మనేని నాని, అయినపూడి భానుప్రకాష్, కార్యదర్శి కమతం నాగరాణి, ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఎం నేతల సాయం

చల్లపల్లి: సీపీఎం జిల్లా కమిటీ పిలుపుమేరకు గన్నవరం సీపీఎం నాయకులు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో వెలివోలు, చల్లపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లోని వరద బాధితులకు బుధవారం దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. గన్నవరం పట్టణ కార్యదర్శి మినప నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు కైలా ఏసుదాసు, టీవీ శ్రీనివాస్, చల్లపల్లి మండల కార్యదర్శి యద్దనపూడి మధు, పాము నాంచారయ్య పాల్గొన్నారు.

చిన్నాపురంలో చేనేత కార్మికులకు..

మచిలీపట్నం టౌన్: చిన్నాపురంలో మగ్గాలు మునిగిపోవడంతో చేనేత కార్మికులకు బియ్యం, ఆయిల్, పంచదార, కందిపప్పు, బంగాళదుంపలు, ఉల్లిపాయలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, నాంచారయ్య, రాజులపాటి వెంకటేశ్వరరావు, తమటం నరసింహారావు, భద్రయ్య పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నందివాడ: వరద బాధితులకు ప్రభుత్వం అందించిన నిత్యావసర సరుకుల కిట్లను బుధవారం తమిరిశ గ్రామంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. అనంతరం పునరావాస కేంద్రాలను పరిశీలించారు. వరద బాధితులకు జొన్నపాడు, నందివాడ, తుమ్మలపల్లి, పెదలింగాల, పోలుకొండ, రుద్రపాక, వెన్ననపూడిలో పది రోజులుగా భోజన సదుపాయాలు, పండ్లు, నిత్యావసర సరుకులు అందించిన నాయకులు, దాతలు, స్వచ్ఛంద సంస్థల వారికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూరగడ్డ శ్రీకాంత్, దానేటి సన్యాసిరావు, దావులూరి సురేంద్ర, చాట్రగడ్డ రవి, పిన్నమనేని పూర్ణ వీరయ్య చౌదరి (బాబ్జి), ప్రభాకర్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో వృద్ధుడి మృతదేహం

అవనిగడ్డ, సెప్టెంబరు 11: దక్షిణ చిరువోలులంక వద్ద కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు సామాజిక మాధ్యమాల్లో ఫొటో వైరల్ కావటంతో మృతుని బంధువులు గుర్తించారు. ఆ మృతదేహానికి దహన సంస్కారాలు పూర్తి చేశారు. "బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన మన్నె పూర్ణచంద్రరావు(70) మోపిదేవి వెళ్లొస్తానని చెప్పి, నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయలుదేరాడు. అప్పటి నుంచి కనిపించకపోవటంతో మేము వెతుకుతున్నాం. బుధవారం ఉదయం దక్షిణ చిరువోలులంకలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు సామాజిక మాధ్యమాల్లో ఫొటో వైరల్ అయ్యింది. దీంతో వెళ్లి చూశాం. అది మా నాన్నదిగా గుర్తించాము." అని కుమార్తె రూపశ్రీ తెలిపారు. పూర్ణచంద్రరావుకు భార్య ఉమాదేవి, కుమార్తె రూపశ్రీ ఉన్నారు. కొంతకాలంగా ఆయన ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని వారు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించిన అనంతరం దక్షిణ చిరువోలులంక వద్ద దహన సంస్కారాలు పూర్తి చేశారు.

గుడివాడలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద..

గుడివాడ: రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద భాస్కర్ థియేటర్ వద్ద 35 నుంచి 40 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు గుర్తించామని టూటౌన్ సీఐ చిన్ని దుర్గాప్రసాద్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

వీకేఆర్ అండ్ వీఎన్‌బీ కళాశాలకు అటానమస్ హోదా

గుడివాడ: వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాలకు 2024-2034 వరకు అటానమస్ హోదాను కల్పిస్తూ యూనివర్సిటీ ఆఫ్ గ్రాంట్స్ కమిషన్ ఉత్తర్వులిచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి.ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠ్యాంశాలు, బోధన, పరీక్షల నిర్వహణలో కళాశాల స్వయం ప్రతిపత్తిని కలిగి ఉంటుందని, మెరుగైన విద్యాబోధన అందుతుందని తెలిపారు. సాంకేతిక విషయాలపై విద్యార్థులు పట్టు సాధించి బీటెక్ ఆఖరి ఏడాదిలోనే బహుళజాతి కంపెనీలో ఉద్యోగాలు పొందడానికి అటానమస్ హోదా దోహదపడుతుందన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు ఉన్నతమైన ఉద్యోగ అవకాశాన్ని కల్పించడం తమ కళాశాల లక్ష్యమని కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య తెలిపారు. అటానమస్ హోదా రావడంపై అకడమిక్ డైరెక్టర్ బి.కల్యాణ్ కుమార్, ఐక్యూఏసీ సమన్వయకర్త గంజి వెంకటరత్నం, డీన్స్ జి.వి.ఎస్.బి.ప్రభాకర్, కొల్లిపర దుర్గాప్రసాద్, విభాగాల అధిపతులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ఐడీ కార్డులు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 11: లేడీయాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన 425 మంది విద్యార్థినులకు రూ.50 వేల విలువైన ఐడెంటిటీ కార్డులను బుధవారం సిటీ కేబుల్ ఎండీ కొల్లు శ్రీనివాసరావు వితరణగా అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, కళాశాల ప్రిన్సిపాల్ వి.సుందరలక్ష్మి, లోగిశెట్టి వెంకటస్వామి పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

నా క్లయింటు కోడి సందీప్ తండ్రి : రాజారావు గారు, కొండా శంకర్‌రెడ్డి గారి నుండి Doc. No. 5774/2021 గా క్రయం పొందిన దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని సర్వహక్కులతో అనుభవించుచున్నారు. దరిమిలా నా క్లయింటు తన ఆస్తిని UBI లో లోను తీసుకొనుటకు ది. 23-08-2024న జిరాక్స్ కాపీలు తీయించుకొనే నిమిత్తం ఉయ్యూరు నుండి కానూరుకు వచ్చినప్పుడు చూచుకొనగా నా క్లయింటు ఆస్తికి సంబంధించిన Original Link Document No. 3433/2008 SRO Vuyyuru మరియు కొండా శంకర్‌రెడ్డి గారి పేరున ఉన్న ఒరిజినల్ పట్టాదారు పాస్‌పుస్తకం కనబడలేదు. కావున పై దస్తావేజులు ఎవరికైనా దొరికిన ఈ క్రింది అడ్రసుకు తెలియచేయవలెను. అట్లుగాక ఎవరైనా పై పేర్కొన్న ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం. 3433/2008 మరియు డాక్యుమెంట్లను ఉపయోగించి ఏ విధమైన లావాదేవీలు జరిపినచో అట్టి లావాదేవీలకు నా క్లయింటు బాధ్యులు కారు మరియు వారి మీద సివిల్ క్రిమినల్ చర్యలు కూడా తీసుకొనబడును.

షెడ్యూలు : కానూరు గ్రామం, పమిడిముక్కల మండలం, ఎస్.ఆర్.ఓ. ఉయ్యూరు లో ఆర్.ఎస్.నెం. 111/2ఏలో య. 0-65 ట్లు భూమికి హద్దులు : తూర్పు : నాగరాజు దివ్య గారి భూమి, దక్షిణం : నాగరాజు దివ్య గారి భూమి, పడమర : జిల్లా పరిషత్ రోడ్డు, ఉత్తరం : కోడి సందీప్ గారి భూమి.

ఎల్. విజయలక్ష్మి, న్యాయవాది
ఫ్లాట్ నెం.5, 100 అడుగుల రోడ్డు
ఆటోనగర్, విజయవాడ-520007
సెల్ : 99083 55529



కాజలో అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

అగ్ని బాధిత కుటుంబాలకు చేయూత

కూచిపూడి, సెప్టెంబరు 11: కాజలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరు పూరిపాకలు దగ్ధం కాగా, బాధిత కుటుంబాల వారిని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా బుధవారం పరామర్శించారు. దుస్తులు, నిత్యావసరాలు, బియ్యం, ఆర్థిక సహాయం అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధి బెల్లంకొండ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మస్తానరావు, తాతా నారాయణరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చినకరగ్రహారంలో..

మచిలీపట్నం టౌన్: బందరు మండలం చిన కరగ్రహారంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మన్నెంరెడ్డి వనజ కుటుంబానికి మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, టీడీపీ బందరు రూరల్ మండల అధ్యక్షుడు కుంచే నాని, ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఐపీసీ కరుణకుమార్‌లు కుట్టు మిషన్, సీలింగ్ ఫ్యాన్, నిత్యావసర వస్తువులను అందజేశారు. రమేష్‌బాబు, యాకోబు, జాషువా, నవమణిరాజు, దుర్గారావు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

కోడూరు, సెప్టెంబరు 11: టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు వేడుకలు నిర్వహించారు. 50 ఎస్టీ కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఉల్లి శేషగిరిరావు, దామెర్ల నారాయణ, అప్పికట్ల రవీంద్ర, గోగినేని సోమశేఖరరావు, ముద్దినేని చంద్రరావు, జరుగు కిరణ్, తాతా పోతురాజు, బొలిశెట్టి విఠల్ రావు, బొడ్డు వెంకన్న, గాదె రమేష్ పాల్గొన్నారు.



మోపిదేవిలో గణనాథుని ఊరేగింపుగా తీసుకెళ్తున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఉద్యోగులు

వైభవంగా గణపతి నిమజ్జనాలు

మోపిదేవి, సెప్టెంబరు 11: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వినాయకుడి నిమజ్జనోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో వినాయక చవితి రోజున మట్టితో తయారు చేసిన గణనాథుని ప్రతిష్ఠించి ఐదు రోజులపాటు విశేష పూజలు చేశారు. ఆలయ సిబ్బంది ఊరేగింపుగా కృష్ణానదికి తీసుకుని వెళ్లి ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనం చేశారు. ఆలయ ఈవో ఎస్.ఎస్.చక్రధరరావు, పర్యవేక్షకుడు బొప్పన సత్యనారాయణ, సహాయక ఉద్యోగులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో..

చల్లపల్లి: ప్రధాన సెంటర్లోని శ్రీలక్ష్మీ విఘ్నేశ్వర స్వామి దేవాలయం వద్ద గణేశ్ ఉత్సవాలు ముగిశాయి. వినాయకుని ఊరేగింపు వైభవంగా నిర్వహించి నిమజ్జనం చేశారు. ట్యాక్సీ ఓనర్స్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

లడ్డూ రూ.35 వేలు

నందివాడ: వినాయకుడికి బహూకరించిన 6 కేజీల లడ్డూకు మంగళవారం రాత్రి వేలం నిర్వహించగా పరుచూరి సతీష్, నాగలక్ష్మి చిన్న కుమారుడు దేవాన్ష్ లోక్ ఆదిత్య రూ.35 వేలకు దక్కించుకున్నారు.

గుంతలు పూడ్చడం అభినందనీయం

గుడివాడ: పెద ఎరుకపాడులోని వార్డు రోడ్డు గుంతలను తన సొంత నిధులు రూ. లక్షతో కాగితాల ఏడుకొండలు పూడ్చడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు కొనియాడారు. బుధవారం పెద ఎరుకపాడులో టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ దారపురెడ్డి మణేశ్వరరావు, దారపురెడ్డి శేషు ఆధ్వర్యంలో ఏడుకొండలను ఆయన సత్కరించారు. నాయకులు కొడాలి రామరాజు, ముళ్లపూడి రమేష్, చాగంటిపాటి దేవేంద్రుడు, గడ్డం దుర్గాప్రసాద్, కోసూరి అనీల్, రాజనాల సురేష్, శేషగిరి, గడ్డం గరామకృష్ణ పాల్గొన్నారు.

బోనస్ పంపిణీ

మోపిదేవి, సెప్టెంబరు 11: కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో రావివారిపాలెంలోని పాల కేంద్రంలో పాలు పోసే 140 మంది రైతులకు బుధవారం రూ.1.45 లక్ష బోనస్ పంపిణీ చేశారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. సంఘం అధ్యక్షుడు రావి లక్ష్మణరావు, పామర్రు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ సీహెచ్ దామోదర కృష్ణ గోపీనాథ్, రావి ప్రభుప్రసాద్, బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మచిలీపట్నం టౌన్: కూచిపూడి నాట్యాచార్యుడు ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద వినాయక చవితి పందిరిలో అన్నమయ్య రామదాసు కీర్తనలకు సుంకర జయ సింధూర, వై.హారిణి, నంద సాకేత, జస్మితశ్రీ, ఎ.దేవీశ్రీప్రియ బిందు చేసిన నాట్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంతోష్ హోటల్ వద్ద సామూహికంగా మహిళలు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు.



కలెక్టరేట్ వద్ద నృత్య ప్రదర్శన